క్లుప్తంగా

మొక్కలు నాటిన జేసీఐ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) రాజమహేంద్రవరం స్టార్టప్స్ ఆధ్వర్యంలో కాతేరు సమీపంలోని గామన్ రోడ్డు డివైడర్‌లో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ మోహన ప్రియ మాట్లాడుతూ జేసీఐ వీక్‌లో భాగంగా ఈ వారమంతా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా మొక్కలు నాటినట్టు తెలిపారు. సెక్రటరీ పావని పద్మావతి, దుర్గాభవాని, దిల్లేశ్వరరావు, మురళీధర్, కృష్ణకపూర్, సుధాకర్ పట్నాయక్, భారతి పాల్గొన్నారు.

చిలుకూరికి చందన పరామర్శ



చిలుకూరి లక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: మాతృవియోగంతో ఉన్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ సోమవారం పరామర్శించారు. కడియంలో వారి స్వగృహానికి వెళ్లి చిలుకూరి లక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చందన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల జేసీఎస్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి, తండికొండ విష్ణుమూర్తి, పార్టీ నాయకులు ఉన్నారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సోమవారం చిలుకూరి కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

తక్కువ ఖర్చుతో ఇంటిలోనే పౌష్టికాహారం

రాజమహేంద్రవరం రూరల్: తక్కువ ఖర్చుతో ఇంటిలోనే పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ టీఎంవో వైహెచ్ మరియ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా హుకుంపేట డి బ్లాకులోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు సమావేశం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఇంటి వద్ద లభించే దినుసులతో పౌష్టికాహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఏ.వి జయలక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఎం.ప్రసాద్, ఏఎన్ఎం సుకుమారి లత, ఎంఎల్‌హెచ్‌వీ మానస, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

నిరసన ప్రజాస్వామిక హక్కు

ప్రకాశం నగర్: నిరసన ప్రజాస్వామిక హక్కు అని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సోమవారం టీడీపీ ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపు సందర్భంగా పలుచోట్ల టీడీపీ నాయకుల్ని పోలీసులు అరెస్టులు చేయడం, మరి కొందరిని గృహ నిర్బంధంలో ఉంచడం అ ప్రజాస్వామికమన్నారని విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర కార్యదర్శి బి.పవన్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంపికలు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని జూబ్లీ మెమోరియల్ ఆర్‌సీఎం హైస్కూల్లో అండర్ 14, 17 విభాగాలలో మంగళవారం బాలురకు, బుధవారం బాలికలకు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఇబ్రహీం ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, యోగా, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంపికలు జరుగుతున్నాయి.

అనుమానాస్పద మృతిపై కేసు

సీతానగరం: వంగలపూడికి చెందిన కొయ్యల మూడి సత్యనారాయణ (71) మృతిపై ఆయన బావమరిది నందిపాటి ఉదయ్ భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఏఎస్సై సమర్పణరావు సోమవారం తెలిపారు. సత్యనారాయణకు నాలుగేళ్ల క్రితం గుండెకు సంబంధించి ఇబ్బంది రావడంతో స్టంట్లు వేశారు. అయితే పొలం విషయంలో చుట్టుపక్కల వారితో ఇటీవల ఘర్షణ పడ్డాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు మృతి చెందాడు. ఈ ఘటనపై ఆయన బావమరిది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఈఓపీఆర్డీగా ఎంఎస్ఎన్‌రెడ్డి

పెదపూడి: మండల ఈఓపీఆర్డీగా ఎంఎస్ఎన్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీడీఓ పి.విజయ భాస్కర్, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, యార్ల ఉమామహేశ్వరరావు, ఎం.త్రినాథ్, ప్రసన్నకుమార్, స్వామి, చిన్ని తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంఎస్ఎన్‌రెడ్డి ఇప్పటివరకూ సామర్లకోటలోని ఐటీసీ ట్రైనింగ్ సెంటర్‌లో నోడల్ అధికారిగా పనిచేసి పదోన్నతిపై పెదపూడి ఈఓపీఆర్డీగా వచ్చారు.

మాజీ సైనికులకు అండగా నిలుస్తాం

- కలెక్టర్ మాధవీలత
- కలెక్టరేట్‌లో జిల్లా సైనిక సంక్షేమ బోర్డు సమావేశం



జిల్లా సైనిక సంక్షేమ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని సైనికులు, వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, వారి సంక్షేమం కోసం ప్రతిపాదించిన అంశాలపై సానుకూలంగా స్పందించే విధానంలో ఆయా శాఖలకు మార్గదర్శకాలు జారీ చేస్తామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా సైనిక సంక్షేమ బోర్డు సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైనిక సంక్షేమ శాఖ ప్రతిపాదించిన అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. మాజీ సైనికులు మాట్లాడుతూ ఇంటి పన్ను మినహాయింపు, వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న పథకాలలో మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ, మునిసిపల్ దుకాణాల్లో షాపులను కేటాయింపులు జరపాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనలో మాజీ సైనిక కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో అవకాశాల కల్పనకు ఉత్తర్వులు జారీ చేయాలని, పారిశ్రామిక రంగంలో తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని కోరారు. రాజమహేంద్రవరంలో సైనిక సంక్షేమ భవన నిర్మాణానికి ఆరు సెంట్ల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కాగా.. సైనిక సంక్షేమ బోర్డు ప్రతిపాదించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని, ప్రాధాన్యతా క్రమంలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి సార్జెంట్ పి.సత్య ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, కల్నల్ గంటా చంద్ర శేఖర్, సార్జెంట్లు గంధం ప్రసాద్, జేడబ్ల్యూ మూర్తి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ వినతి

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు విధి నిర్వహణలో ఎటువంటి ఆటంకాలు కల్గించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మాధవీలతకు ఏపీపీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విన్నవించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక, కోశాధికారి డాక్టర్ శ్రీనివాస్, 20 మంది వైద్యులు సోమవారం సాయంత్రం కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. గత నెల 21వ తేదీన రంగంపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వైద్యాధికారి లావణ్యకు జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే డాక్టర్ లావణ్యకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

బాలికల వసతి గృహం సందర్శన



వసతి గృహంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సోమవారం కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ బాలికలకు అందిస్తున్న వసతులను పరిశీలించారు. అనంతరం బాలికలతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరూ బాగా చదువుకోవాలని, జీవితంలో పురోగతి సాధించాలన్నారు. మంచి, చెడు స్పర్శలకు తేడాను వివరించారు. ఎటువంటి సమస్యలున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి, పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి



చందన నాగేశ్వర్‌ను సత్కరిస్తున్న రాజు తదితరులు

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకులపై ఎంతో నమ్మకంగా వివిధ పదవులను కేటాయించారని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. జిల్లా పార్టీ కార్యదర్శిగా ఇటీవల నియమితులైన పులిదిండి రాజు సోమవారం రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా కార్యదర్శి తాడాల విష్ణు చక్రవర్తి ఆధ్వర్యంలో నాగేశ్వర్‌కు శాలువా కప్పి సత్కరించారు. పార్టీలో సముచిత స్థానం కల్పించిన జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌కు రాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చక్రవర్తి, అయితరెడ్డి తాతయ్యకాపు, దాసరి శ్రీను, గంజి రమణ, కూసి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు సన్మానం



సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

సీటీఆర్ఐ: సమాజంలోని అభాగ్యులకు, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలనే సదుద్దేశంతో ఆశ్రమాన్ని స్థాపించిన జీవకారుణ్యానందస్వామి ఆశయాన్ని చిత్తశుద్ధితో ముందుకు తీసుకు వెళుతున్నామని గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రె కొండబాబు అన్నారు. స్థానిక 50 డివిజన్‌లోని గౌతమీ జీవకారుణ్య సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ మార్గాని భరత్ సహకారంతో 83 ఏళ్ల తర్వాత ప్రతిష్టాత్మక చైర్మన్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి దక్కడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. పదవి విషయంలో నిబద్ధత కలిగి నడుచుకుంటూ, ముఖ్యమంత్రి జగన్ ప్రతిష్ఠకు భంగం కలగకుండా వ్యవహరిస్తామన్నారు. స్థానిక ఆనంద్ రెజెన్సీ పందిరి హాల్లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు అభినందన సభ ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు రూ. 7.50 లక్షల షాపు అద్దెల బకాయిల విషయంలో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి నడుచుకుంటామన్నారు. సమావేశంలో బోర్డు డైరెక్టర్లు పైదా ఉషా, అనంత లక్ష్మి, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు మిథున్ రెడ్డి కృషి



ఎంపీ మిథున్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేస్తున్న ఎంపీలు బోస్, భరత్ రామ్, కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, అడపా శ్రీహరి



యువకులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్, ఆకుల వీర్రాజు, షర్మిలా రెడ్డి

- కొనియాడిన ఎంపీలు బోస్, భరత్‌రామ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- ఘనంగా రాజంపేట ఎంపీ పుట్టినరోజు వేడుకలు

ప్రకాశం నగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పార్టీ పటిష్టతకు వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్ర బోస్, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి పుట్టినరోజును సోమవారం తిలక్ రోడ్డులోని అర్బన్ కో ఆర్డినేటర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. కార్యక్రమంలో అర్బన్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

500 మందికి హెల్మెట్ల పంపిణీ

స్థానిక జేఎన్ రోడ్డులోని ఏకేసీ కాలేజీ 100 ఫీట్ రోడ్డు వద్ద ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మిత్ర మండలి ఆధ్వర్యంలో సోమవారం ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఇన్నమూరి ప్రదీప్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే 500 మంది యువకులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ మిథున్ రెడ్డి నిత్యం ప్రజలతో తిరుగుతూ, నిరాడంబరంగా ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ మిథున్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. లంక సత్యనారాయణ, వరద కిరణ్, కరీం ఖాన్, దాట్ల పృథ్వీ, నీలి ఆనంద్ కుమార్, మానే దొరబాబు, బురిడి త్రిమూర్తులు పాల్గొన్నారు.

- రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి ఆధ్వర్యంలో కంబాలచెరువు సమీపంలోని ఎమ్మెస్సార్ హైటెక్ బస్టాండ్ దగ్గర ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు ఖాకీ షర్టులు పంపిణీ చేశారు.
- రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజు ఆధ్వర్యంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, కాకుల పాటి కుమార్, తిరుపతి రాయుడు, ఎస్‌కే సమీరా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతిని ప్రజలందరూ గుర్తించారు

- నిరుద్యోగుల పేరుతో రూ.కోట్లు స్వాహా
- వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్



మాట్లాడుతున్న సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

ప్రకాశం నగర్: స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు నాయుడు పాల్పడిన అవినీతిని ప్రజలందరూ గ్రహించారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబు కావాలంటే బాబు రావాలని చెప్పి అధికారంలోకి చంద్రబాబు.. ఆ తర్వాత నిరుద్యోగుల పేరుతో రూ.కోట్లు స్కామ్ చేశారన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల వైపు, సత్యం వైపు నిలబడతుందన్నారు. చంద్రబాబు అవినీతికి సంబంధించి ఇటీవల రూ.118 కోట్ల ఐటీ శాఖ నోటీసు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చే ముసుగులో రూ.371 కోట్ల భారీ కుంభకోణం, అమరావతి ల్యాండ్ స్కామ్, ఏపీ ఫైబర్ నెట్ స్కామ్, ఇన్నర్ రింగ్ రోడ్ స్కామ్, టిడ్కో ఇలా జాబితాకు అంతులేదన్నారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి మాట్లాడుతూ ఆంధ్రా యువత భవిష్యత్తుకు, రాష్ట్ర ప్రగతికి ఉద్దేశించిన నిధులను బాబు స్వాహా చేశారన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జులు కొత్త విజయ రాజ్యలక్ష్మి, పోలు విజయలక్ష్మి, బర్రే కొండబాబు, మజ్జి అప్పారావు మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, వార్డు ఇన్‌చార్జులు దాసి వెంకట్రావు, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

సీటీఆర్ఐ: స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలపై ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజలు నుంచి 13 అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, సూపరింటెండెంట్ జి.పాండురంగారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనకు వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ.చైత్రవర్షిణి అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్డీఓ డిజినల్ అధికారులతో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్డీఓ చైత్రవర్షిణి మాట్లాడుతూ ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందన, జేకేసీ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.

పాలనాంశాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: క్షేత్రస్థాయిలో పనిచేసే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పరిపాలనాపరమైన అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక రివర్‌బే సమావేశ మందిరంలో జిల్లాలోని గ్రేడ్ 1 నుంచి గ్రేడ్-5 గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మూడోదశ శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం, 73వ రాజ్యాంగ సవరణ, ఇతర న్యాయపరమైన అంశాలపై కార్యదర్శులు అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా కార్యాలయ మాన్యువల్, ఎస్ఆర్ ఈజీఎస్, లేఅవుట్లు అనుమతులు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్వమిత్ర, డ్రాఫ్టింగ్ తదితర అంశాలపై క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. కిందిస్థాయి నుంచి జిల్లా, ఆపై స్థాయి వరకు పరిపాలనా అంశాల్లో జరిగే మార్పులను గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసే జీవోలు, మెమో సర్క్యులర్ల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ ఆరమ్‌స్ట్రాంగ్, మాస్టర్ ఆఫ్ ట్రైనీలు పాల్గొన్నారు.

తోరాటికి పరామర్శ

ధవళేశ్వరం: పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ తోరాటి ప్రభాకరరావును సోమవారం వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఇటీవల తోరాటి ప్రభాకరరావు భార్య విజయలక్ష్మి మృతి చెందారు. ఆమె చిత్రపటానికి చందన నాగేశ్వర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జేసీఎస్ కన్వీనర్లు తాటికొండ విష్ణుమూర్తి, తడాల చక్రవర్తి, సచివాలయ కన్వీనర్లు తలారి వరప్రసాద్, గోలి దేవకుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, శ్రీరంగం బాలరాజు, గునిపె అశోక్, పందెళ్ల భానుప్రసాద్, దాసరి ధర్మ, కుమార్ ఉన్నారు. అనంతరం టీడీపీ గ్రామ మాజీ అధ్యక్షుడు పుక్కళ్ల సత్తిబాబు కుటుంబ సభ్యులను చందన నాగేశ్వర్ పరామర్శించారు.

అమరవీరులకు నివాళి

గోకవరం: జాతీయ అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలని ఫోక్స్‌పేట రేంజర్ ఎం.కరుణాకర్ అన్నారు. జాతీయ అటవీ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సూదికొండ ఫోక్స్‌పేట రేంజర్ కార్యాలయంలో అటవీ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరుల ఆశయ సాధనకు సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలన్నారు. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. డిప్యూటీ రేంజ్ అధికారి సుజాత, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల వాయిదా

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో సోమవారం ప్రారంభించాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలను 144 సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో వాయిదా వేసినట్లు సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్ రెడ్డి తెలిపారు. త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని చెప్పారు.

క్రీడలతో మానసిక, శారీరక వికాసం



ఎంపికైన విద్యార్థినులతో ఆనంద బాల తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: మానసిక, శారీరక వికాసానికి క్రీడలతో ఎంతో ఉపయోగపడతాయని శాప్ డిప్యూటీ డైరెక్టర్, ది సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఫర్ ఒలింపిక్ మూవ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎంఏ డీన్ అన్నారు. బొమ్మూరులోని మారుతి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీలో కిక్ బాక్సింగ్ స్టేట్ ప్రెసిడెంట్ జి.ఆనంద్‌బాలు పర్యవేక్షణలో ఆదివారం రాత్రి కేలో ఇండియా మహిళల జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ ఎంపికలు జరిగాయి. శాప్ డిప్యూటీ డైరెక్టర్ ఎంఏ డీన్, ది సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఫర్ ఒలింపిక్ మూవ్‌మెంట్ కోఆర్డినేటర్ కె.పద్మనాభం అధ్యక్షతన, జిల్లా కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ ఎస్.గిరి వెంకటరమణ, సెక్రటరీ ఎం.గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా విశాఖపట్నానికి చెందిన కె.సుమన్, జోగారావు, సంతోష్ కుమార్, రామచంద్రపురానికి చెందిన బీకే రత్నం, వై.ఆంజనేయకుమార్ వ్యవహరించారు. అనంతరం 20 మందిని ఎంపిక చేశారు.

శారదారావు సేవలు చిరస్మరణీయం



శారదారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎంపీ భరత్ రామ్

కంబాలచెరువు: జీఎస్‌కేఎం లా కళాశాల వ్యవస్థాపకురాలు శారదారావు సేవలు చిరస్మరణీయమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. జేఎన్ రోడ్డులోని శారదారావు నివాసంలో సోమవారం సంతాప సభ నిర్వహించి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ భరత్ రామ్ ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్‌కేఎం లా కళాశాలకు ఎంత ఘన కీర్తి ఉందో, ఆ కళాశాల వ్యవస్థాపకురాలు శారదాదేవికి అంత పేరుందన్నారు.

ఆమె 102 ఏళ్లు సంపూర్ణ ఆరోగ్యవంతురాలిగా జీవించి, చివరి శ్వాస వరకూ అటు విద్యా రంగంలో, ఇటు సమాజ సేవా రంగంలో విశేష సేవలందించారన్నారు. తన కళాశాల ద్వారా ఎంతో మంది న్యాయవాదులు, న్యాయమూర్తులను అందించారన్నారు. మహాత్మాగాంధీ చేతుల మీదుగా అవార్డు తీసుకున్న మహనీయురాలు శారదారావు అని కొనియాడారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు, 50వ వార్డు ఇన్‌చార్జి గుత్తుల మురళీధర్ ఇంటికి వెళ్ల ఆయన మాతృమూర్తికి ఘన నివాళులర్పించారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బంద్ విఫలం



రాజమహేంద్రవరం కాంప్లెక్స్‌లో బస్సుల రాకపోకలు

కడియం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో జైలుకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి మద్దతుగా టీడీపీ శ్రేణులు చేపట్టిన బంద్ విఫలమైంది. కడియం ఉదయం పలు చోట్ల టీడీపీ నాయకులు ఒత్తిడి చేసి షాపులను మూయించివేశారు. అయితే 11 గంటల సమయానికి యథావిధిగా షాపులను యజమానులు తెరిచారు. ప్రైవేటు పాఠశాలలకు మాత్రం ముందురోజే సెలవు ప్రకటించారు. ఆటోలు, ఆర్టీ బస్సులు నడిచాయి.

ధవళేశ్వరం: ధవళేశ్వరంలో దుకాణాలు యథాతథంగా తెరిచి, వ్యాపారాలు నిర్వహించారు. పోలీసులు గ్రామంలో బందోబస్తు నిర్వహించారు.

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలో దుకాణాలు తెరచుకున్నాయి. బంద్ ఏమాత్రం ప్రభావం చూపలేదు. బస్సులు మామూలుగానే నడిచాయి. ప్రజలు తమ రోజువారీ కార్యకలాపాలను ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహించుకున్నారు.